మాజీ మంత్రి సురేష్‌ను కలిసిన దుంపా



ఆదిమూలపు సురేష్‌ను సత్కరిస్తున్న దుంపా రమణమ్మ, నాయకులు

సంతనూతలపాడు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌ను సింగరాయకొండ క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ నెల 8వ తేదీ ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవానికి ఆదిమూలపు సురేష్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాయకులు దుంపా యలమందారెడ్డి, కొండపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వసంతరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ప్రభదాస్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకటరావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ, ర్యాలీ

సంతనూతలపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని ఒంగోలు 41వ డివిజన్ కుమ్మరిపాలెం అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం ర్యాలీ, ప్రతిజ్ఞ, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. పేర్నమిట్ట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాలలో బాల్యవివాహాలను అరికడదామంటూ నినాదాలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు జి.సునీత, బి.నాగేంద్రం, డి.కాంచన, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

మద్దిపాడు: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేందుకు హాస్టల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ హాస్టల్‌కు మరమ్మతులు చేయించడానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో విద్యార్థులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని వార్డెన్ రామును ఆదేశించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పశువులకు టీకాలతో ఎంతో ఉపయోగం

నాగులుప్పలపాడు: పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు, బ్రూసెల్లా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. మండలంలోని చదలవాడ గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. 8 నెలలు నిండిన ప్రతి పశువుకు తప్పకుండా గాలికుంటు టీకాతో పాటు పాల దూడలకు బ్రూసెల్లా టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నాగభూషణం, పశువైద్యురాలు అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీపై కమిటీ ఏర్పాటు చేయాలి

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలుపై కమిటీ ఏర్పాటు చేయాలంటూ సీఆర్పీలు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కమిటీ ఏర్పాటుపై చాలా సంవత్సరాల నుంచి పోరాడుతున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని, ఈ సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 5, 6 తేదీల్లో మండల కేంద్రంలో రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.వినయ్ కుమార్, టి.సుజనారాణి, జి.రాణి, పి.వసంతలక్ష్మి, కళ్యాణి, శ్రీదేవి, అటెండర్ ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయాలి

నాగులుప్పలపాడు: మండలంలోని గ్రామాల్లో ప్రతి కుటుంబానికి సంబంధించి పీ4 సర్వేను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి బేబీరాణి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో పీ4 సర్వే జరుగుతున్న తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ అంశంలో ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. తదుపరి గ్రామాల వారీగా సర్వే ఎంత వరకు పూర్తి చేశారని వివరాలడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మురళీమోహన్, సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతులను ఆదుకోవాలి
- పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి డిమాండ్

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా రైతులకు ఎటువంటి మంచి జరగలేదని విమర్శించారు. జనవరి నెలలో ఎర్ర శనగలు రూ.7500, తెల్లశనగలు రూ.10 వేలు బయట మార్కెట్‌లో ఉన్నాయన్నారు. పంట ఇంటికి వచ్చే సమయంలో ఎర్ర శనగలు రూ.5300, తెల్ల శనగలు రూ.6000 మాత్రమే ధర ఉన్నాయన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. మిర్చి పంట గత సంవత్సరం రూ.25 వేలు ఉంటే, ప్రస్తుతం రూ.11 వేలకు పడిపోయిందన్నారు. మిర్చి ధర రూ.11 వేలు ఉంటే సాగు చేసిన రైతులకు పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. కనీసం రూ.16 వేలు అయినా ఉంటే పెట్టిన పెట్టుబడులు వస్తాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో చంద్రబాబు మిర్చి రైతులను ఆదుకోకపోవడం దురదృష్టకరమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డుకు వెళ్లగా సీఎం చంద్రబాబు సెంట్రల్‌తో మాట్లాడతానన్నారని, మరుసటి రోజు నావల్ల కాదని చేతులు ఎత్తేశారని విమర్శించారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం, ఎన్డీఏ ప్రభుత్వం ఎక్కడా రైతులను ఆదుకోవడం లేదన్నారు. ఉత్తరాదిన ఎన్డీఏ ప్రభుత్వం మీద రైతులు ఉద్యమాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో కరోనా సమయంలో కూడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పంటలు కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించారన్నారు. చంద్రబాబు ఎందుకు అలా చేయలేకపోతున్నారో ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మీరు ఏదో చేస్తారని ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే మీరు ఏమీ చేయలేదని విమర్శించారు. చంద్రబాబు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటలు కొనుగోలు చేయకపోతే రాబోయే రోజుల్లో రైతులు ఇబ్బందులు పెడతారంటూ వైఎం ప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఈ క్రాప్ విధానం ద్వారా రైతులు ఎంత పండించారో తెలుసుకుని పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు సిద్ధం కావాలి

- ఏకేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సోమశేఖర

ఒంగోలు సిటీ: డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్ లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సిద్ధం కావాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.సోమశేఖర అన్నారు. బుధవారం ఏయే కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలో అనే విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ డి.ఓ.ఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల ప్రాంగణంలో «స్టూడెంట్ కెరీర్ గైడెన్స్ ఆన్ పీజీ కోర్సెస్ ఇన్ ఏకేయూ» అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ జి.సోమశేఖర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అన్ని సెట్‌లకు ఎంట్రన్స్ పరీక్షల కోసం నోటిఫికేషన్ జారీ చేస్తుందని చెప్పారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ప్రస్తుతం 13 కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వాటికి సంబంధించి ప్రవేశాల కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఏసీఈ డాక్టర్ అంచుల భారతీ దేవి మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ ఎంట్రన్స్ పరీక్షలను ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 25న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో పీజీ ప్రవేశాలతో పాటుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశం కోసం పీజీ పూర్తి చేసుకున్న వారిలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మే 2 నుంచి మే 5వ తేదీ వరకు చేపట్టే ఏ.పి.ఆర్.సెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఐసెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా ఎంబీఏ విభాగంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ సహాయ ఆచార్యుడు డాక్టర్ జడ అరుణ్ కుమార్ తెలిపారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో పీజీ అడ్మిషన్ల కోసం పూర్తి వివరాలు కావాల్సిన విద్యార్థులు యూనివర్సిటీ పని వేళల్లో డీఓఏ కార్యాలయంలో స్వయంగా సంప్రదించవచ్చన్నారు. దూర ప్రాంత విద్యార్థులు సెల్: 6304343448, 8978496178 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఈత ముక్కల, కోలా సాయి బాబు, శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.యోగయ్య చౌదరి, ఏ.కే.యూ. డి.ఓ.ఏ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సోమశేఖర

నమ్మించి నట్టేట ముంచిన మోడీ

ఒంగోలు టౌన్: అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను నమ్మిస్తూ నట్టేట ముంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన కొనసాగిస్తున్నారని సంయుక్త కిసాన్ రైతు మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అదే నిజమైతే దేశంలోని 84 కోట్ల మంది ప్రజలకు చౌకదుకాణాల ద్వారా ఆహార ధాన్యాలను ఎందుకు పంపిణీ చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలోని రైతాంగం ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ఎన్నికల హామీ ఇచ్చిన మోదీ పాలనలో రైతులు గిట్టుబాటు ధరల కోసం ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సమయంలో స్వామినాథన్ సిఫార్సుల మేరకు గిట్టుబటు ధరలు కల్పిస్తామంటూ ప్రధానమంత్రి హోదాలో మోదీ స్వయంగా లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఐ న్యూ డెమోక్రసి రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ పాలన తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. రైతు సంఘం జిల్లా నాయకులు పమిడి వెంకటరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతు నాయకులు కోడూరి కోటేశ్వరరావు, కోసూరి వెంకటేశ్వర్లు, జజ్జురి జయంతి బాబు, ఎల్. రాజశేఖర్, కె. హనుమంతరావు, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు చుండూరి రంగారావు

ఫాసిజాన్ని మట్టికరిపించిన ఉక్కుమనిషి.. స్టాలిన్

ఒంగోలు టౌన్: రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఫాసిజాన్ని మట్టికరిపించిన స్టాలిన్ ప్రపంచ వ్యాప్తంగా పీడిత ఉద్యమాలలో స్ఫూర్తి నింపారని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ఉన్న మంచిపుస్తకం వద్ద స్టాలిన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్టాలిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కొంగ నరసింహం, వామపక్ష, ప్రజాతంత్ర నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో రైజ్ విద్యార్థినుల సత్తా



మహిళా కబడ్డీ జట్టును అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ వారు బెక్టాగస్-2025 కార్యక్రమంలో భాగంగా కల్చరల్, క్రీడా పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించగా సుమారుగా 12 టీంలు పాల్గొన్నాయి. వారిలో రైజ్ కృష్ణ సాయి గ్రూప్‌నకు చెందిన కబడ్డీ టీం విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ కబడ్డీ క్రీడలో తమ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలవడం హర్షదాయకమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి ఉండటం వలన వారు మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. 12 మందితో కూడిన కబడ్డీ జట్టు మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచినందుకు వారిని రైజ్ రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు. కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నారు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్లు హిమచంద్రబాబు, సుబ్బారావు అభినందించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్

ఒంగోలు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు మార్చి 8వ తేదీ మార్కాపురం వస్తున్న సందర్భంగా మార్కాపురం పట్టణానికి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్ అన్నారు. ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురానికి కేటాయించిన మెడికల్ కాలేజీ నిర్మాణం అర్ధంతరంగా మధ్యలో ఆగిపోయిందని, నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ చదువులకు కొనసాగింపుగా ఇంటర్, డిగ్రీ, పీజీ ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడం దారుణమైన పరిస్థితి అన్నారు. ఎస్వీకేపీ కాలేజీకి ఎయిడ్ రద్దు చేసిన కారణంగా ఈ ప్రాంత విద్యార్థులకు చదువు కొనుక్కోవాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైందన్నారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ హైస్కూల్ మార్కాపురంలో ఉందని, బాలికలకు బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు పలు దఫాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఉపయోగం లేదన్నారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లాగా కేంద్ర ప్రభుత్వమే గుర్తించింది అందులోనూ ఇంకా వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రకాశం జిల్లాకు విద్యా అవకాశాలు ఏర్పాటు చేయాలని, వాటి గురించి ముఖ్యమంత్రి తమ పర్యటనలో మాట్లాడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యక్షులు దేవ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్

హామీలు తుంగలో తొక్కిన చంద్రబాబు

ఒంగోలు టౌన్: మహిళలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు తుంగలో తొక్కారని ఐద్వా నగర కార్యదర్శి ఆదిలక్ష్మి ధ్వజమెత్తారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చైతన్య నగర్‌లో ప్రదర్శన నిర్వహించారు. అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలా రూ.1500 సాయం అందజేత వంటి ఏ ఒక్క హామీని చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. హామీల అమలు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం కూటమి ప్రభుత్వం వైఖరికి నిదర్శనమన్నారు. నిధులను కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మహిళలపై హింసకు కారణమైన మద్యాన్ని ఆదాయవనరుగా మార్చుకున్న కూటమి ప్రభుత్వం మహిళలకు మేలు చేస్తుందనుకోవడం ఒట్టి భ్రమ అన్నారు. మద్యం ద్వారా ఈ ఏడాది రూ.27 వేల కోట్లు ఆశిస్తుందని, ఈ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలపై దాడులు, లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లైంగిక దాడి నిందితులను బీజేపీ బహిరంగంగా సమర్థించడంతో మహిళలకు భద్రత లేకుండా పోతుందన్నారు. మహిళా నాయకులు కె. రాజేశ్వరి, అనిత, తిరుపతమ్మ, సామ్రాజ్యం, పద్మ, సంతానం, నాగమ్మ, ఏ.అనిత కుమారి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా నేతలు

కొక్కిలగడ్డకు లంకపోతు పరామర్శ

కొత్తపట్నం: అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికొచ్చిన మండలంలోని కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొక్కిలగడ్డ శ్రీనివాసులను బుధవారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు భర్త సైకం రాంబాబు, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల కాంతారావు, కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, గాలి ముసలారెడ్డి, వెంకటనారాయణ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శ్రీనివాసులను పరామర్శిస్తున్న ఎంపీపీ లంకపోతు, ఆళ్ల, మిట్నసల, తదితరులు

సోషల్‌మీడియా పోస్టులపై అక్రమ కేసులు తగదు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: సోషల్ మీడియా పోస్టులు పెట్టిన వారిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించడం మంచి పద్ధతి కాదని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ లీగల్ సెల్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు లీగల్ సెల్ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం, నోటీస్ ఇచ్చి తిప్పడం వంటి పనులు చేస్తున్నారన్నారు. అనంతరం అనుబంధ విభాగాల సంఘాలతో మహిళా దినోత్సవానికి సంబంధించి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దుంపా చెంచిరెడ్డి, దుంపా రమణమ్మ, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇమ్రాన్‌ఖాన్, కమ్మ సురేష్, పిగిలి శ్రీను, బడుగు ఇందిర, ఎస్.ఎస్.ఆర్, మేరీ, రమణమ్మ, ప్రసన్న, మహిళా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులు బహుజన చైతన్య ఉత్సవాలు

ఒంగోలు టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నుంచి నెల రోజుల పాటు బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. ఈ ఉత్సవాల్లో అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన కళా ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బుధవారం నగరంలోని ఎల్బీజీ భవనంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ఈ సాంస్కృతిక ఉత్సవాలు కర్నూలు జిల్లాలో ప్రారంభమై 26 జిల్లాలగుండా మే నెలాఖరున విజయవాడలో ముగుస్తాయని తెలిపారు. అంబేడ్కర్ జీవిత విశేషాలను అన్ని వర్గాల ప్రజలకు తెలియజేసేందుకు వివిధ రూపాల్లో కళా ప్రదర్శలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 11 నుంచి సామాజిక సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కుల వివక్ష, అంటరానితనం పోవాలని, కలిసి వచ్చే ప్రజా తంత్రవాదులతో ప్రతి ఘటనను చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.రఘురాం, ఎండీ ఆనంద్ బాబు, జి.చిరంజీవి, క్రాంతి బాబు, నటరాజ్ రంగమ్మ, తిరుపాలు పాల్గొన్నారు.



కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర వర్క్‌షాపులో మాట్లాడుతున్న మాల్యాద్రి